చీకటి జీవో రద్దు చేయాలి

విశాలాంధ్ర గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

భోగిమంటల్లో ప్రతుల దహనం

విశాలాంధ్ర- రాజమండ్రి: చీకటి జీవో వన్ రద్దు చేయాలని కోరుతూ టిడిపి ,జనసేన ,సిపిఐ ,సిపిఎం కాంగ్రెస్ ,ఆమ్ ఆద్మీ, సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ ,బీఎస్పీ తదితర ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో శనివారం స్థానిక సోమలమ్మ గుడి వద్ద భోగిమంటల్లో వేసి జీవో ప్రతులను దహనం చేశారు. ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ సీఎం జగన్ జీవో రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రాజ్యాంగ వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నారని దీనిని ప్రజలందరూ గమనిస్తున్నారని తొందరలోనే ఆయనకు తగిన బుద్ధి చెప్తారని అన్నారు . పిఎసి మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్ మాట్లాడుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు జరుగుతున్నాయని వాటికి భయపడిన జగన్మోహన్ రెడ్డి చీకటి జీవో తీసుకొచ్చారని విమర్శించారు.

మాజీ ఎమ్మెల్సీ టిడిపి సీనియర్ నాయకులు ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ లోకేశ్ పాదయాత్ర , పవన్ బస్ యాత్ర ,సిపిఐ రామకృష్ణ పోరాటాల యాత్రకు భయపడిన జగన్ జీవో తీసుకొచ్చారని ఆయన ఎద్దేవా చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, న్యూ డెమొక్రసీ జోజి కిరణ్ , జట్లు లేబర్ అధ్యక్షులు కె.రాంబాబు, సిపిఐ వి.కొండలరావు, వై శ్రీనివాస్, గన్ని కృష్ణ, అనుశ్రీ సత్యనారాయణ , సేపేని రమణమ్మ , ఎడ్ల లక్ష్మి, సప్ప రమణ వెంకట్రావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో...

విశాలాంధ్ర - అమలాపురం,రామచంద్రపురం : చీకటి జీవో నెంబర్ -1 రద్దు చేయాలని శనివారం రామచంద్రాపురంలో జీవో పత్రాలను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. గోపాల్‌రావు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను రాష్ట్ర ప్రభుత్వం అతి దుర్మార్గంగా కాల రాస్తుందని విమర్శించారు. సీపీఎం నాయకులు నూకల బలరా మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యల మీద నిరసన తెలియజేసే హక్కు ఉందని తమ స్వార్థం కోసం అణచాలని చూస్తే ప్రజలు తిరగబడి ప్రభుత్వాన్ని భూస్థాపితం చేస్తారని అన్నారు.

సిపిఎంఎల్ నాయకులు సూరిబాబు మాట్లాడుతూ, చీకటి జీవోను వెనక్కి తీసుకోవాలని లేనియెడల ప్రజలను ఐక్యం చేసి పోరాటాలకు సిద్ధమవుతామని అన్నారు.సిపిఐ నాయకులు పెద్దింశెట్టి రాము, బాజీ, ఆర్ సత్యనారాయణ, సత్తిబాబు, ఆర్ఎస్ నారాయణ, కృష్ణ పాల్గొన్నారు.

సామర్లకోట...

విశాలాంధ్ర - సామర్లకోట : సీపీఐ ఆధ్వర్యంలో జగన్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జీవో నెంబర్ వన్ ప్రతులను శనివారం విఘ్నేశ్వర థియేటర్ ఎదురుగా ఉన్న వేణుగోపాల స్వామి గుడి వద్ద భోగిమంటల్లో దహనం చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కమిరెడ్డి బోడకొండ, పట్టణ కార్యదర్శి పిదిరెడ్ల సత్యనారాయణ, సీనియర్ నాయకులు ఎలిసెట్టి రామదాసు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

సంక్రాంతి సంప్రదాయం భావితరాలకు తెలియజెప్పాలి

విశాలాంధ్ర - రావులపాలెం : మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు తెలియచెప్పే పండుగల్లో సంక్రాంతికి ప్రత్యేక స్థానం ఉందని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం పోతంశెట్టి రామిరెడ్డి పార్కులో సంక్రాంతి సందర్భంగా స్థానిక సి.ఆర్.సి ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 18 వ తేదీ వరకు జరగనున్న సంక్రాంతి, వేమన జయంతి ఉత్సవాలను శనివారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రారంభించారు. భోగి మంటను వెలిగించి సంక్రాంతి సంబరాలను, ఎగ్జిబిషన్ ను ప్రారంభించారు. ప్రపంచంలో ఎక్కడెక్కడో ఉన్న తెలుగు వారు సంక్రాంతికి వారి స్వగ్రామాలకు చేరుకుని కుటుంబ సమేతంగా సంక్రాంతి వేడుకలు జరుపుకుంటారన్నారు.

పేకాట, గుండాటలాడితే కేసు: డీఎస్పీ

విశాలాంధ్ర - మండపేట : సంక్రాంతి పేరుతో సాంప్రదాయ క్రీడలు ఆడితే వారి జోలికి పోయేది లేదుగానీ, పేకాట, గుండాట వంటి జూద క్రీడలు ఆడితే కేసులు తప్పవని రామచంద్రపురం డీఎస్పీ బాల చంద్రారెడ్డి హెచ్చరించారు. డీఎస్పీ నేతృత్వంలో డివిజన్ వ్యాప్తంగా పందెం స్థావరాలపై దాడులు నిర్వహిస్తున్నారు. మండపేట రూరల్ ప్రాంతాలతో పాటు పట్టణ పరిసరాల్లో ఎక్కడెక్కడ కోడి పందేలు జరుగుతున్నాయనేది తెలుసుకుని పందెం బరుల వద్ద దాడులకు ఉపక్రమించారు. రూరల్ సీఐ పెద్దిరెడ్డి శివ గణేశ్ పోలీసు సిబ్బందితో కలిసి మారేడుబాక, గొల్లపుంత కాలనీ రోడ్డులో యథేచ్ఛగా నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరాల వద్దకు వెళ్లి నిర్వాహకులకు వార్నింగ్ ఇచ్చారు. డీఎస్పీ మాట్లాడుతూ సంక్రాంతి మూడు రోజులూ సంప్రదాయ బద్ధంగా ఆటలు ఆడితే అందరికీ శ్రేయస్కరమన్నారు. కాదంటే ఊచలు లెక్క పెట్టాల్సి వస్తుందని అన్నారు. కోడి పందేల నిర్వాహకులను అదుపులోకి తీసుకోవాలని సీఐ గణేశ్ ను ఆదేశించారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమించండి

విశాలాంధ్ర - కాట్రేనికోన : మండల కేంద్రమైన కాట్రేనికోన గేటు సెంటర్లో ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమించాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇక్కడకు రోజూ వందలాదిమంది వివిధ పనులుపై వస్తూ పోతూ ఉంటారు. రెండు ప్రభుత్వ బ్రాందీ షాపులు ఇక్కడనే ఏర్పాటు చేయడంతో మద్యం ప్రియులతో సెంటర్ ఎప్పుడు రద్దీగా ఉంటుంది. వీటికి తోడు రోడ్డు పక్కనే అడ్డం దిడ్డంగా మోటార్ సైకిళ్లు, ఆటోలు పెట్టడం, కొందరు వ్యాపారులు ఆర్టీసీ బస్ షెల్టర్‌ను సైతం ఆక్రమించి ఎదుటనే దుకాణాలు పెట్టడంతో ప్రయాణికులు ఆరు బయట రోడ్డుపైనే బస్సులు ఆటోల కోసం నిలబడి వేచి చూడాల్సి వస్తోంది. దీంతో తరచూ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ట్రాఫిక్ వల్ల తరచూ ఘర్షణలు, చిన్న చిన్నప్రమాదాలు ఇక్కడ జరుగుతున్నాయి. అయినా సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని అన్నారు. కనీసం పండుగ రోజుల్లో నైనా కానిస్టేబుల్ నియమించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇకనైనా పోలీస్ అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామాలు ప్రజలు కోరుతున్నారు.

పెడసనగంటి ట్రస్టు సేవలు అమోఘం

విశాలాంధ్ర - దేవరపల్లి : సమాజ అభివృద్ధిలో పెడసనగంటి ట్రస్టు సేవలు ఎంతో అద్భుతమైనవని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు పేర్కొన్నారు. శనివారం ట్రస్ట్ ద్వారా పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుండి ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు సాయిబాబు ఉపాధ్యక్షుడు శశికాంత్ శర్మలు ట్రస్టు ద్వారా చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. పి శశికాంత్ శర్మ, మౌనిక, రాజ్యలక్ష్మి, సాయి, విఖ్యాత సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ దుగ్గిన గంగాధరరావు, మాధవరపు వెంకటేశ్వరరావు, రామన్నపాలెం హెచ్ఎం పేరం రవీంద్ర, పెడసన గంటి సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాల్లో సినీ సందడి!

విశాలాంధ్ర - గండేపల్లి : మండలంలో భోగిమంటల్లో సినీ సందడి నెలకొంది. ఎన్‌టి రాజా పురం గ్రామ శివారులో పామాయిల్ తోటలో ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరంలో భాగంగా భోగి పండుగ,వాలీబాల్ పోటీలు నిర్వహించారు. వైసిపి సీనియర్ నాయకులు మాజీ సొసైటీ అధ్యక్షులు పరిమిబాబు ఆధ్వర్యంలో సినీ నటులు సమీర్, హేమ, శివ, బాలాజీ, జ్యోతి తదితర ఆర్టిస్టులు భోగిమంటను ప్రారంభించారు. వీరితో అనేకమంది సెల్ఫీలు దిగారు. సర్పంచ్ బిక్కిన దేవి దుర్గ, పరిమిరాజు, వార్డు సభ్యులు మరియు, వైసీపీ నాయకులు రమేష్ యూత్ అదే విధంగా గ్రామం నుండి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. అదేవిధంగా మురారి, పి నాయకంపల్లి గ్రామాల్లో సంబరాలు నిర్వహించారు.

వైభవంగా తిరువాభరణోత్సవం
భక్తులకు దర్శనమిచ్చిన మకరజ్యోతి



విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : అయ్యప్ప స్వామి తిరువాభరణోత్సవం ఆద్యంతం ఎంతో రమణీయంగా కొనసాగాయి. శనివారం తిరువాభరణోత్సవాలు జక్కంపూడి రాజా కుటుంబ సభ్యులు ఎంతో వైభవంగా నిర్వహించారు. ముందుగా అయ్యప్ప స్వామి ,అమ్మవారి తీరువాఆభరణాలకు గురు స్వాముల పర్యవేక్షణల జక్కంపూడినివాసం నందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రకాశం నగర్ లో ఉన్న ఆయనే నివాసం నుండి గురుస్వాముల పర్యవేక్షణలో కొమ్ముల సాయి ,జక్కంపూడి గణేష్ శ్రీ అయ్యప్ప స్వామి తిరువా ఆభరణాలను,అమ్మ వారి ఆభరణాలను కేరళ చెండై వాయిద్యములు,కోలాటములు,డోలు సన్నాయి,మేళ తాళములు,కేరళ సంప్రదాయ నృత్యం థెయ్యం,సింగారి మేళములతో ఆశేష భక్తజనుల నడుమ ఊరేగింపుగా బయలుదేరి టిటిడి కళ్యాణ మండపం,కంబాలచెరువు, దేవిచౌక్ మెయిన్ రోడ్డు,డీలక్స్ సెంటర్,విశ్వేశ్వర స్వామి గుడి మీదుగా అయ్యప్ప స్వామివారి ఆలయమునకు చేరుకుని స్వామివారి ఆభరణాలు పూజారులకు సమర్పించారు. ప్రధాన అర్చకుడు స్వామివారికి తిరువాభరణాలను అలంకరణ చేశారు. అనంతరం మకరజ్యోతి రూపంలో అయ్యప్ప స్వామి భక్తులకు దర్శనమిచ్చారు.జక్కంపూడి రాజా మాట్లాడుతూ ప్రతి ఏడాది మాది మాదిరిగానే అయ్యప్ప కు ప్రీతికరమైనటువంటి తిరువాభరణోత్సవం ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నామని తెలియజేశారు.

అంతా క్షేమంగా ఉండాలి: మురళీమోహన్

మహా మహిమాన్వితుడు అయ్యప్పస్వామి దయవల్ల ప్రజలంగా క్షేమంగా ఉండాలని కోరుకుంటున్నట్టు రాజమహేంద్రవరం మాజీ ఎంపీ మాగంటి మురళీమోహన్ అన్నారు. శబరిమలై అయ్యప్పస్వామి దర్శనానికి వెళుతున్న ఆయన శనివారం సాయంత్రం అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ విపర్తి వేణు గోపాల్ రావు, శ్రీమతి జక్కంపూడి విజయలక్ష్మి డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజు,రూడా చైర్ పర్సన్ శ్రీమతి మేడపాటి షర్మిల రెడ్డి,మాజీ శాసనసభ్యులు రౌతు సూర్య ప్రకాశ రావు, రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, మాజీ ఎమ్మెల్సీ అదిరెడ్డి అప్పారావు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజమండ్రి మాజీ ప్రెసిడెంట్ నందెపు శ్రీనివాస్,దాసి వెంకట్రావు,సంకీన భవాని ప్రియ,ఆడపా అనిల్, మానే దొరబాబు,పింకే సురేష్, అవాల సతీష్,కోడి కోట,నాళం రోశయ్య,తోట సుబ్బారావు, అయ్యప్ప స్వామి ఆలయ ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

కోనసీమలో పందేలకు సై ...

విశాలాంధ్ర - అమలాపురం: కోనసీమలో సంప్రదాయ సంక్రాంతి కోడిపందాలుకు ఒకే చెప్పిన పోలీసులు పేకాట, గుండాటలను ఉక్కు పాదంతో అణచివేశారు. మూడు రోజులుగా కోడి పందాలకు అనుమతి ఇవ్వాలని మంత్రి పినిపే విశ్వరూప్‌తో పాటు బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు పట్టుబట్టి వత్తిడి చేయటంతో పోలీస్ సింగం కాస్త కరుణించింది. ఎస్పీ పి సుధీర్ కుమార్ రెడ్డి కోనసీమలో అనాదిగా పేరుపడ్డ దురాచారాలు, అసాంఘిక కార్యకలాపాలు సంక్రాంతి మూడు రోజులు సంప్రదాయ క్రీడలుగా చెప్పి సాగిస్తున్న అనాచారాల్ని ఉక్కుపాదంతో అణచి వేశారు. కోనసీమ జిల్లా వ్యాప్తంగా కోడి పందేలు జోరుగా సాగుతుండగా పేకాట గుండాటలు లేక పందాలు జరిగే బరులు వెలవెల బోతున్నాయి.

సామర్లకోటలో తెరతీశారు!

విశాలాంధ్ర - సామర్లకోట : సంక్రాంతి పండుగ అనగానే కోడిపందాలు, గుండాటలు ఎక్కడ చూసినా ఇదే కోలాహలం కనిపించడం పరిపాటి. ఈ ఏడాది కూడా అదే కోలాహలం సామర్లకోట మండల పరిధిలో కనిపించింది. నిన్నటి వరకు కోడిపందాల నిర్వహణపై ప్రభుత్వం ఎలాంటి అనుమతులు ఇవ్వకపోయినా సంక్రాంతి పండుగ ప్రారంభమైన భోగి పండుగ రోజున మండలంలో కోడిపందాలకు నిర్వాహకులు తెర తీశారు. శనివారం ప్రధానంగా వేట్లపాలెం, జీమేడపాడు, వెంకటకృష్ణ రాయపురం గ్రామాల్లో ఈ కోడిపందాలు జోరుగా సాగుతున్నాయి. తొలుత పందాల నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేవని పోలీసులు నిర్వాహకులకు గట్టిగానే హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. కోడి పందాలు నేపథ్యంలో లక్షలాది రూపాయలు వ్యాపారం జరుగుతుంది. అలాగే గుండాటలు కూడా జోరుగానే మండలంలో ప్రారంభమయ్యాయి.

పంతం ఓడింది... పందెంకోడి గెలిచింది!

విశాలాంధ్ర-గోపాలపురం: మండలంలో పలుచోట్ల కోడిపందాలు హోరాహోరీగా జరిగాయి. కోడిపందాలకు ప్రభుత్వం నుండి అనుమతులు లభించడంతో పందెంరాయుళ్లు తమ హవాని కొనసాగిస్తూ, కోడిపందాలు నిర్వహిస్తున్నారు.మండలంలోని వేళ్ళ చింతలగూడెం గ్రామంలో సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని యువత వ్యసనాల వైపునకు మగ్గుచూపుకుండా క్రికెట్ కబడ్డీ ముగ్గుల పోటీలునిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా మండలంలోని గోపాలపురం,చిట్యాల,జగన్నాథపురం,వేళ్ల చింతలగూడెం,సంజీవపురం, గుడ్డిగూడెం, హు క్కుంపేట,దొండపూడి, గంగోలు, కొవ్వూరుపాడు, గ్రామాలలో కోడిపందాలు నిర్వహించడం విశేషం.

రోడ్ సేఫ్టీ వారోత్సవాలు

విశాలాంధ్ర - అమలాపురం : ప్రస్తుత జనాభా యాంత్రిక జీవనాన్ని అనుభవిస్తున్న తరుణంలో రహదారులపై ప్రయాణం అనివార్యమైందనీ, దీంతో రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యం సంతరించు కుందని ఏపీఎస్ ఆర్టీసి ఆర్ఎమ్ ఆర్‌విఎస్ నాగేశ్వరావు అన్నారు. సంస్థ కార్యాలయంలో రోడ్ సేఫ్టీ వారోత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రోడ్డు ప్రమాదాలు, వాటి నివారణ" అనేది నేటి యాంత్రిక జీవనంలో కీలకంగా ఉందన్నారు. ముఖ్యంగా 25 నుండి 35 సంల వయస్సు వారు అత్యధికంగా రోడ్డు ప్రమాదాలకు గురి అగుచున్నారని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు విస్తృతస్థాయిలో ప్రచారం చేయుటకు రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్, రోడ్ ఇంజనీరింగ్, ఎన్ఫోర్స్మెంట్ (పెనాల్టీలు), ఎమర్జెన్సీకేర్ దీనిలో మొదటిదైన రోడ్ సేఫ్టీ ఎడ్యుకేషన్ను అనేక యన్‌జిఓ సంస్థల ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ ఎడ్యుకేషన్ ట్రైనింగ్, వర్క్షాప్, సెమినార్లు ద్వారా అవగా హన కల్పించటం జరుగుచున్నదన్నారు. రోడ్డు సేఫ్టీపై ఈ నెల 17వ తేదీ వరకు రహదారి భద్రత వారోత్సవాలు స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో నిర్వహించి అవగాహన పెంపొందించడం జరుగు తుందన్నారు. హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని, కారు సీటు బెల్టు తప్పని సరిగా పెట్టుకో వాలని, ఫోన్ మాట్లాడుతూ వాహనము నడుపురాదన్నారు. రోడ్ సేఫ్టీ స్వచ్ఛంద సేవా సంస్థ రీజినల్ చైర్మన్ అరిగెల వెంకటరామారావు (నాయుడు), డిఎమ్‌సి హెచ్ఎస్ఎన్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ... సంక్రాంతి సంబరాలు



విశాలాంధ్ర - అమలాపురం : ముమ్మిడివరం నియోజకవర్గంలో సీపీఐ సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. 27వ వార్డులో సాంప్రదాయ బద్దంగా ఆడబడుచు (పార్టీ మహిళలకు)లు 100 మందికి పసుపు, కుంకుమ, చీరలు పంపిణీ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి కే సత్తి బాబు ప్రారంభించారు. కౌన్సిలర్ త్రిమూర్తులు, నియోజకవర్గ కార్యదర్శి శీలం వెంకటేష్ ప్రతి సంవత్సరం సంక్రాంతికి తమ పార్టీ ఆడబిడ్డలకు చీరెలు అందజేయడం ఆనవాయితీ. కాంగ్రేకుల కృష్ణారావు, మనోహర్,భాగ్యవతి, సీతా,దుర్గా, అరుణా పాల్గొన్నారు.

వృద్ధులను ఆదుకోవాలి

విశాలాంధ్ర - గోపాలపురం : వృద్దులు పేదలను ఆదుకోవడంలో ఉన్న తృప్తి ఉన్నతమైనదని సర్పంచ్ జొన్నకూటి మణమ్మ తెలిపారు.మండలంలోని వాదాలకుంట గ్రామంలో శాలెం ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మందిర ప్రతిష్ట మొదటి వార్షికోత్సవ సమావేశం పాస్టర్ జెకరియా పలివెల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బ్రదర్ కె. తిమోతి, దైవజనులు ప్రేమరాజు మందిరమువిశిష్టతను తెలియ చేశారు.సర్పంచ్ జొన్నకూటి మణెమ్మ ఏర్పాటుచేసిన చీరలను వృద్ధులకు వితంతువులకు మణెమ్మ, మోహన్ సంఘ పెద్దలు కె. డేవిడ్, పి. సుందరం, దుర్గారావు, సాలెం ప్రేయర్ ఫెలోషిప్ డైరెక్టర్ కే మాణిక్యం, పాస్టర్ పలివెల జెకర్యా చేతుల మీదుగా అందజేశారు.

సంక్రాంతి విశిష్టమైన పండుగ

విశాలాంధ్ర-అనపర్తి: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని శనివారం సంప్రదాయ కోడిపందాలను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్తి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ చాలా విశిష్టమైందని వయసుతో నిమిత్తం లేకుండా చిన్నారుల నుండి వృద్ధుల వరకు అందరూ కలిసి సకుటుంబ సమేతంగా ఆనందంగా జరుపుకునే పండగ సంక్రాంతి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్, పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు),వీరుళ్ళమ్మ కమిటీ అధ్యక్షులు సత్తి వెంకట రామారెడ్డి, కర్ణాటక పౌల్ట్రీ ఫెడరేషన్ సెక్రటరీ సత్తి త్రినాథ్ రెడ్డి, పార్టీ అనపర్తి టౌన్ అధ్యక్షులు నల్లమిల్లి మురళీ, ఉపసర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, పడాల కళ్యాణ్ రెడ్డి, నల్లమిల్లి నాగిరెడ్డి, కొవ్వూరి వెంకటరెడ్డి, మేడపాటి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కోనసీమలో 'ప్రభ'ల శోభ!

విశాలాంధ్ర - అంబాజీపేట : సంక్రాంతి వేళ కోనసీమ ప్రభల తీర్థం ఒక వైవిద్య సాంప్రదాయం. దీనికి నాలుగు వందల ఏళ్ళ చరిత్ర ఉంది. రంగు రంగుల వస్త్రాలతో మిరుమిట్లు గొలిపే చెమ్కీలతో, ఆదిబిక్షువు చిత్రాలతో అందంగా అలంకరించి పిల్లా జెల్లా చేసే సందళ్ళ మధ్య భక్తుల భుజస్కందాల మీదుగా తీర్థాలకు తరలివెళ్ళి పూజలందుకునే ప్రభల తీర్థం ఆద్యాంతం..ఆధ్యాత్మికకు ఆటపట్టుగా ఉంటుంది. కనుమరోజే పెద్ద శుభమూహూర్తము. అంబాజీపేట మండలం మొసలపల్లి గ్రామం శివారు జగ్గన్నతోటలో జరిగే ఏకాదశ రుద్రప్రభల తీర్థానికి 17వ శతాబ్దంలో బీజం పడింది. కోనసీమలో జగ్గన్నతోట ప్రభల తీర్థమే తొలిదిగా చరిత్రకెక్కింది.

కన్నుల పండుగగా జగ్గన్నతోట : జగ్గన్నతోటకు పరిసర గ్రామాల్లో ఉన్న శివాలయాల నుంచి 11 రుద్ర ప్రభలు ఈ తీర్థానికి చేరుకుంటాయి. గంగలకుర్రు అగ్రహారంలోని శ్రీ వీరేశ్వరస్వామి, గంగలకుర్రులోని శ్రీ చెన్నమల్లేశ్వరస్వామి, వ్యాఘ్రేశ్వరంలోని శ్రీ వ్యాఘ్రేశ్వరస్వామి, పాలగుమ్మిలోని శ్రీచెన్నమల్లేశ్వస్వామి, కె పెదపూడిలోని శ్రీ మేనకేశ్వరస్వామి, ఇరుసుమండలోని శ్రీ ఆనందీరామేశ్వరస్వామి, వక్కలంకలోని శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి, నేదునూరులోని శ్రీ చెన్నమల్లేశ్వరస్వామి, ముక్కామలోని శ్రీ రాఘవేశ్వరస్వామి, మొసలపల్లిలోని శ్రీ మధుమానంత భోగేశ్వరస్వామి, పుల్లేటికుర్రులోని శ్రీ అభినవ వ్యాఘ్రేశ్వరస్వామి వార్ల ఆలయాలకు చెందిన ఈ ఏకరుద్ర ప్రభలు కనుమ పండుగ రోజున భక్తుల భుజస్కందాలపై శరభ...శరభ.... ఆశ్చరభ....అంటూ వీరభద్రున్ని జపిస్తూ జగ్గన్నతోటకు ఈ ప్రభలను తోడ్కొని వస్తారు. సంక్రాంతికి నెల రోజుల ముందు నుంచి ఈ 11 గ్రామల ప్రజలందరూ కలసి తమ తమ గ్రామ రుద్ర ప్రభల తయారీలో నిమగ్నమై తీర్థానికి ఆతిథ్యమిచ్చే మొసలపల్లి గ్రామనికి చెందిన శ్రీ మధుమానంత భోగేశ్వరస్వామి ప్రభ అన్ని ప్రభలకంటే ముందే వచ్చి కొలువు తీరుఉంది.

ఉరువాడలో ఉల్లాసంగా భోగిమంటలు

విశాలాంధ్ర - సీతానగరం : ఉరువాడలో ఉల్లాసంగా భోగి మంటలు వేశారు. మండలంలో అన్ని గ్రామాలలో శనివారం తెల్లారుజాము నుండి చిన్న పెద్ద తేడా లేకుండా భోగిమంటలు వేసుకొని ఆటపాటలతో కాలక్షేపం చేశారు. అనంతరం ప్రజలు దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతానగరం విష్ణు ఆలయంలో గోదా దేవి కళ్యాణం భక్తుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ప్రతీ ఇంటా అతిథులు రాకతో సందడి వాతావరణం నెలకొంది. సంప్రదాయబద్ధంగా ప్రజలు జరుపుకున్నారు.

పోటాపోటీగా ముగ్గులు

విశాలాంధ్ర - సీతానగరం : పోటాపోటీగా మహిళల ముగ్గులు వేశారు. మండలంలో సింగవారం గ్రామంలో సర్పంచ్ సంగన చిన్న పోసియ్య ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. బత్తుల వెంకటలక్ష్మి విజేతలకు బహుమతులు అందజేశారు. పోసియ్య మాట్లాడుతూ సంక్రాంతి అంటే జూదం, కోడి పందాలు కాదు అని మన సంస్కృతి సాంప్రదాయాలు ప్రతీ బింబం అని అది తెలిసేలా ముగ్గులు పోటీలు పెట్టడం జరిగిందని అన్నారు. మహిళలు పెద్ద ఎత్తున వేసిన రంగవల్లులు చూపరులను ఆకట్టుకున్నాయి.

పోలీసులపై ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆగ్రహం

విశాలాంధ్ర - రావులపాలెం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సంక్రాంతి సందర్భంగా వైసీపీ ఎమ్మెల్యేలు దగ్గరుండి కోడి పందాలు ప్రారంభించారు. గుండాటలకు అనుమతి లేదంటూ బరుల వద్దకు వచ్చిన పోలీసులపై ఎమ్మెల్యే జగ్గిరెడ్డి విరుచుకుపడ్డారు. ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి. రావులపాలెం గ్రామ పరిధిలోని సిఆర్‌సి రోడ్డు, వెదిరేశ్వరం రోడ్లలో వైసీపీ నాయకులు కోడి పందాల నిర్వహణకు బరులు ఏర్పాటు చేసారు. అయితే గుండాట నిర్వహణ కోసం కూడా ఏర్పాట్లు జరుగుతున్నాయని సమాచారం అందడంతో శనివారం రావులపాలెం అడిషనల్ ఎస్సై జి సురేంద్ర సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని గుండాట బరుల కోసం ఏర్పాటు చేసిన కర్రలను తొలగింపు చర్యలు చేపట్టారు. ఆ సమయంలో వెదిరేశ్వరం రోడ్డులో ఉన్న బరిలో కోడి పందాలను ప్రారంభించేందుకు వచ్చిన ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. వెంటనే అక్కడనుంచి వెళ్ళిపోవాలని అంటూ మండిపడ్డారు. ఎమ్మెల్యే హెచ్చరికలతో ఖంగు తిన్న పోలీసులు అక్కడి నుంచి నిష్క్రమించారు. అనంతరం రావులపాలెం గ్రామ పరిధిలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కోడి పందాలను మూడు చోట్ల ప్రారంభించారు.

అంగరంగ వైభవంగా తులాబారం

విశాలాంధ్ర-దేవరపల్లి: బాలదుర్గమ్మ ఆలయంలో శనివారం తులాబారం కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. దేవరపల్లి కి చెందిన పసుపులేటి రాధాకృష్ణ వెంకటలక్ష్మి దంపతుల కుమారుడు రోహిత్ కళ్యాణ్ కు పటిక బెల్లం తో తులాభారం నిర్వహించారు.తొలుత అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు.ఆలయ కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ, సభ్యులు కామిశెట్టి దుర్గారావు, గారపాటి అప్పారావు, కామిశెట్టి మంగ, పైడికొండ వెంకటేశ్వరరావు, కొయ్య శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక గ్రంథాల బహూకరణ

విశాలాంధ్ర - దేవరపల్లి : జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య ధ్యాన మందిరం కు దేవరపల్లి గ్రామానికి చెందిన ఆధ్యాత్మికవేత్తలు కేశిరాజు సీతారామయ్య భారతి, కేసు రాజు వెంకట్ రాజ్ కుమార్, శారదా దేవి దంపతులు కంచి పరమాచార్య చంద్రశేఖర సరస్వతీ స్వామి జీవిత చరిత్రకు సంబంధించిన ఆధ్యాత్మిక గ్రంథాలు దేవుని స్వరం గ్రంథాలను బహుకరించారు. సీతారామయ్య భారతి దంపతులు మాట్లాడుతూ ఏడు వాల్యూమ్‌లో గల పుస్తకాలు 7 అందుబాటులో ఉంటాయని తెలిపారు.

యువతకు ఉపాధే ధ్యేయం

విశాలాంధ్ర - దేవరపల్లి: యువశక్తి నిర్వీర్యం కాకుండా వారికి ఉపాధి అవకాశాలు కల్పించడమే జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రధాన ధ్యేయమని గోపాలపురం నియోజకవర్గం జనసేన నాయకుడు డి సువర్ణరాజు పేర్కొన్నారు. దేవరపల్లిలో జనసేన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పవన్ కళ్యాణ్ లాంటి వ్యక్తి రాజకీయాలకు రావటం గొప్ప విషయం అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రతినిత్యం నిలదీస్తున్న వ్యక్తి పవన్ కళ్యాణ్ అని సువర్ణ రాజు పేర్కొన్నారు. కంబాల సత్తిబాబు, జాజిమొగ్గల శ్రీనివాస్ , పోలుమాటి నాని తదితరులు పాల్గొన్నారు.

గుండాటలకు బ్రేక్

విశాలాంధ్ర - కాట్రేనికోన : మండలంలో శనివారం కోడిపందాలు యథేచ్ఛగా సాగాయి. అయితే గుండాటలు, పేకాట తదితర జూదాలకు పోలీసులు బ్రేక్ వేశారు. చెయ్యేరు, గెద్దనపల్లి, కాట్రేనికోన, వేట్లపాలెం, మొక్కల తిప్ప గ్రామాల్లో గుండాట నిర్వాహకులు బోర్డులు వేసేందుకు సన్నద్ధం చేయగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. అక్కడ నుంచి చెదరగొట్టారు. రాజకీయంగా ఒత్తిడి చేసిన జూదరుల పన్నాగం నెరవేరలేదు. అమాయకులైన వారి నుండి గుండాటలు నిర్వహణ ద్వారా కోట్లాది రూపాయలు కాజేయాలని చేసిన ప్రయత్నం పోలీసులు సాగనివ్వలేదు. కోడి పందెం నిర్వాహకులకు లక్షలాది రూపాయలు చెల్లించేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఎస్పీ సుధీర్ కుమార్ రెడ్డి పుణ్యమా అంటూ జూదాలకు ఫుల్ స్టాప్ పడింది.